కథా నిలయం
శ్రీకాకుళం

# మధురమీనాక్షి

## 1

మధుర మీనాక్షి ఆలయం! ఆ వున్నత ప్రాకారాలు, అవిశ్వాస హృదయంలో సహితం అనిర్వచనీయమైన భక్తిభావాన్ని వుదయింపచేసే ఆ గర్భాలయపు మసక చీకట్లూ, దూరదేశాలనించి యాత్రవొచ్చిన భక్తుల స్తోత్రపుశ్లోకాలవల్ల లక్ష్మమ్మగారి హృదయం కొత్త సంతోషంతో గంతులువేసింది. కూతురు కాముడి ముఖంలోకూడా భర్తపోయిన పధ్దెనిమిది నెలలనించి ఆవరించివున్న అంధకారం తొలిగి, కొత్తకాంతి తాండవమాడింది. తోడుతీసుకొచ్చిన శేషయ్యదృష్టి కాముడి కళ్ళనించి ఆలయ సౌందర్యానికీ, ఆలయగాంభీర్యాన్నించి కాముడి నడుము వంపుల నాజూకుకీ దుముకులాడుతోంది. ఆనాటిరాత్రి వుత్సవ ప్రారంభానికి జరిగే సన్నాహోత్సాహాన్ని చూసేప్పటికి వాళ్ళు ముగ్గురూ ఇంతవరకు దేవాలయాన్ని చూశామా, దేవతలయెడ భక్తి నెరుగుదుమా అనుకున్నారు. తెల్లని దీపాలతో గుడి వెలుగుతోంది. దీపాలకందని రాతిచెక్కడాలమధ్య యిరుకుకున్న చీకట్లు గంభీరభావాన్నివుద్భవింపచేస్తున్నాయి. సంగీతమేమీ అర్థం కాకపోయినా, ఆసన్నాయి మాధుర్యం మెండిన లక్ష్మమ్మగారి హృదయంలో పెద్దవెలితిని తోపించి బాధించింది. జాజిపువ్వులూ, గంధమూ, ధూపమూ, హారతీ, తులసీ,

గర్భాలయ పురాతనత్వమూ, అన్నీ కలిసి, భూమికి చెందని అప్రమేయ సుగంధమాధుర్యాన్ని కల్పించాయి. రైల్లో కనపడ్డ తేజమే కాముడికళ్ళలో యింకా తీవ్రంగా కనిపించింది లక్ష్మమ్మగారికి. తనెక్కడో చూసింది అట్లాంటి చూపుని, యెప్పుడో, ఒక్కసారిమాత్రం—యెక్కడ?

విగ్రహాలకి హారతిచ్చారు. వేదగానం చేస్తున్నారు. వుత్సవం బైలుదేరపోతోంది. తాను కొంతదూరం వెళ్ళవొచ్చు. కాముడూ, శేషయ్యా యేరీ! అదుగో, ఆమూల నుంచుని చూస్తున్నారు. యేమిటట్లావున్నాయి వాళ్ళ మొహాలు? మళ్ళీ వుత్సవానందంలో ఆమె హృదయం లీనమయింది. సుందరేశ్వరుడూ మీనాక్షీ ఇద్దరూ రజిత నందివాహనంమీద బైలుదేరారు పురసందర్శనానికి. జన్మం పావనమయింది.

## 2

పూ రేగింపునించి చీలి సత్రంవేపు తిరిగేప్పటికి వొంటిగంటయింది. ఓహో! యేమి పట్టణము! యేమి దేవాలయము! యేమి భక్తి! రామేశ్వరయాత్ర పుణ్యాలోకాలకై, పాపపరిహారార్థమై, చెయ్యాలని వొచ్చింది లక్ష్మమ్మగారు. కాని యిట్లాంటి విపరీతమైన ఆకర్షణగల ఈ దేవాలయ మహాత్మ్యాన్ని చూస్తాననుకోలేదు ఆమె! ఈశ్వరభక్తితో హృదయం మధురమైన గానాన్ని విని పిస్తోంది. భర్తపోయింతరవాత పదేళ్ళు వృథాగా వొంటరిగా, పొలాలు చూసుకుంటో, ఆ వూళ్లో పడివుండకపోతే

అప్పుడే వొచ్చి యిట్లాంటి పుణ్యక్షేత్రాలలో కాపుర మున్నట్లయితే! యింకన్నైనా తను వెనక్కి వెళ్ళకూడదు. కాముడో! కాముడూ వుంటుందేమో! ఆ శేషయ్యని పంపించెయ్యాలి! వాళ్ళకాస్నేహమేమిటి? యెందుకు నవ్వు తున్నారు నిష్కారణంగా! యెప్పుడూ చీకట్లో వెనకపడ తారేం! యీరాత్రి గాలిలో యేదో విద్యుచ్ఛక్తి పరుగు లెత్తుతున్నట్టుగా వుంది. వాళ్ళనవ్వు సహజంగా వినపడ్డం లేదు. యేమిటా అనుమానం తనకి? నిజమేనేమో! ఛీ. ఛీ. యీ పవిత్రక్షేత్రంలో అట్లాంటి ఆలోచనకూడా పాపమే. కానివాళ్ళ చూపులు! యెక్కడో చూసింది తను యిది వరకు—ఒకర్ని చూస్తేనే రెండోవారికి స్వర్గం వొలికినట్లు, ఒకరు పిల్చినగాలి రెండోవారు పీలవడమే మహావరమైనట్లు ....యేమిటది? యెందుకట్లా! దాని అర్థమేమిటి? వాటి కర్థం అదే! మొన్న రైల్లో గిన్నెలుకడిగేప్పుడు, వాళ్ళ వేళ్లు కలుసుకుని అట్లానే ఆగడం తను చూడలేదూ? కాని యీ ఆకర్షణకి అర్థమేమిటి? యెందుకు? ఒకవేళ తన అను మానం నిజమేమో! యీ ఆనందం, యీ వుత్సాహం, నూతనశోభా, యీవేళ్లూ, చూపులూ కలపడం—యివన్నీ అవసరమేముంది—అందులో కాముడికి?

సత్రంలో చీకటిగదిలో పడుకుంటే, స్వర్గాన్ని వొది లివచ్చి, మురికికూపంలో వురికినట్లుంది ఆమెకి. ఆ ఈశ్వర దంపతుల్ని, వజ్రపునగల్ని, మతాబా వెలుతుర్ని: ఆ భక్తులమధ్య తానూ ఆ ఆలయసేవకురాలై వుండిపోకూడదూ!

ఆ వాకిలి వూడ్చి, ఆ పూలమొక్కలు పెంచి, రోజూ స్వామికి.... అంత అదృష్టమా తనకి! ఈ రాత్రి, ఈ నిద్ర, తన బద్ధకం, అప్పుడప్పుడు కనబడే దగ్గు, అన్నీ ఇంక తనని వొదిలిపోవాలి. అవి భరించటం కష్టం. కొత్తలోకపు సుందరాదర్శాలామె నాకర్షించాయి. ఈ నూతన సృష్టి లోని నిగనిగలాడే అద్దపుద్వారాలు విడిబడి ఆమెని ఆహ్వానించాయి. మధురస్వరాలామె చెవులలో ధ్వనించాయి.

*  *  *

లక్ష్మమ్మగారు తన పదమూడోయేట కాపరానికి వెళ్ళింది. అంతకుముందే ఒకవిధంగా కొంచెం సరిగాని అభిప్రాయాలతో పెళ్ళీ, కాపరం, వీటి నిజమైన అర్థం తెలుసు. గర్భాదానంరాత్రి సహజమైన సిగ్గుతో, అతన్ని చాలా అవస్థలు పెట్టింది. అతను భర్తఅనీ, అతను యేంచేసినా అది ధర్మమేననీ, తను లోబడటం, తన శరీరాన్ని అతని సంతోషానికి వప్పచెప్పడం, తన విద్యుక్తధర్మమనీ, ఆమె పూర్వజ్ఞానం ప్రోత్సహిస్తూ వుండడంవల్ల, తన కెంత బాధగావున్నా, అసహ్యంగావున్నా అతని కోర్కెకి లోబడింది. కాని అతను చూపే ప్రేమా, ఆవేశమూ, ఆమెకి అర్థంకాలేదు.

క్రమంగా దినాలు గడిచినకొద్దీ అట్లాంటి సంబంధం ఆమెకి అలవాటయింది. తరవాత యిష్టమయింది; కాని అదంతా రాత్రి పదిగంటలు, తెల్లారకట్ట అయిదుగంటల మధ్యనే. అప్పుడుకూడా అతనేదో ప్రేమ కొంచెం

చూపడం, (తరవాత అదికూడా లేదు.) తనకిష్టమున్నా, లేకపోయినా అతనికి తన శరీరం యివ్వడం, అంతకన్నా యే మోహాన్నీ ప్రేమనీ ఆమె యెరగదు. లోకంలో స్త్రీ పురుష సంబంధమంటే, ఆమె కంతే అర్థం. భర్తపోయిం తరవాత కొత్తలో కొంతకొంత జ్ఞాపకం వొచ్చినా, ఆ బాధతోపాటు, భర్తపోయిన జ్ఞాపకంతట్టి ఆ విచారం యెక్కువై ఈ శరీర బాధని మరిపించేది. క్రమంగా భర్తనీ, భర్తతోపాటు ఆ విషయాన్నీ మరిచిపోయింది. భర్తవల్లనే తనకా అవసరం కలిగింది. భర్త లేకపోతే ఇంక తనకా ప్రసక్తి అవసరమేముంది ? భర్త ఒక్కడే ప్రపంచంలో ఆమెకి పురుషుడు. అతనితో ఆమెకి పురుషులందరూ నశిం చారు.

## 3

దీపం వెలుతురు బైటనించి కళ్ళమీద పడడంచేత లక్ష్మమ్మగారు కళ్లు తెరచి చూసి తను వంటరిగా వుండడం తెలుసుకుంది. యేమైనారు వాళ్ళిద్దరూ ? ఇంక సందేహం లేదు. తన అనుమానం అక్రమంగాదు. మొన్నటివరకూ కాముడి తరహా చూసి, భర్తవియోగంవల్ల బాధపడు తోందని యెంతో సానుభూతిని చూపపోయింది. కాని కాముడి అనుభవంలో తను ప్రవేశించడం, ఆమె హృద యంలో స్థలము నాక్రమించడం చాతగాక వూరుకుని, తనకీ కూతురుకీ వున్న ఆ అసహజమైన దూరాన్నీ వ్యత్యా సాన్నీ తలచుకొని బాధపడ్డది.

ఈ విషయంచూస్తే, అసలు కాముడికి పోయిన భర్తమీద ప్రేమ వుండివుంటుందా? "ప్రేమ" అనే మాటకి లక్ష్మమ్మగారి అర్థంవేరు. ఆమె భర్తపైన ఆమెకి వున్న అనురాగమే ఆమెకి 'ప్రేమ' అని అర్థం. తనుపడ్డ శ్రమా బాధా వృధాకదా? యెంత ప్రేమతో తన హృదయం తల్లడిల్లింది! మరి కన్నకడుపు కదూ! తన కూతురే యిట్లా చేసేది? తన కడుపునపుట్టిన పిల్లేనా? తను అంత ముద్దుగా నీతులు చెప్పి పెంచుకున్న గారాబాల పిల్లేనా యిది? కాముడు తప్పుమార్గాన పడడంకంటే, నీచ వాంఛకు లోబడడంకంటే, పరాయి మొగాడికి, ఆ శేషయ్యకి, తనింతటి తుచ్ఛురాలనని యెట్లా తెలియచేసుకుందో — అది అర్థంకాలేదు. అభిమానం, రోషం, ధీరత్వం, వీటిని తనకూతురు, తనలోనించి పుట్టిన బిడ్డ, యెట్లా వొదులుకో గలిగింది! యిట్లాంటి అక్రమాలు అధమ జాతుల విషయంలో విన్నదిగాని, తన సాటివారిలో, తన వంశంలో యిట్లాంటివెన్నడన్నా జరిగాయా? ఈ పెడ బుద్ధులన్నీ ఆ ఆడబిడ్డలే నేర్పివుండాలి. వాళ్ళ పోకిళ్లూ, వెకిలి వేషాలూ లోకప్రసిద్ధం. వొద్దంటూవుంటే చదువు చూసి ఆవంశంలో ఈ పిల్ల నిచ్చారు. యింకావున్నాయి పుకార్లు.... వాళ్లు.... కడుపులు........తలుచుకోనన్నా గూడదు అట్లాంటి సంగతులు, మధురమీనాక్షి సన్నిధిలో.

మరి తను ఇప్పుడేం చెయ్యాలి? వాళ్లు ఏం చేస్తున్నారో! ఛీ, ఛీ, రాత్రి దేవిదర్శనంచేసి వొచ్చి....అసలు వాళ్ళిద్దరికీ ఇట్లాంటి సంబంధం ఎందుకో? సహజమైన

యవ్వన ఆకర్షణ ఆమెకి అర్థంకాలేదు. తుచ్ఛులుచేసే పని అది. తనకూతురా! కూతురు మొహమూ, మృదువైన మాటలూ తలుచుకుంది. అసంభవం, కాముడిట్లాంటిపని చెయ్యదు. దానిమీద తను అన్యాయంగా అనుమానపడు తూంది. వాళ్ళిద్దరూ వూరికే బైటకూచుని వుంటారు. వుత్సవం చూడ్డానికి మళ్ళీ వెళ్ళారు. అంతే, తను అను మానపడడం నీచం.... పడుకోబోయింది.... కాని సత్రానికి వొచ్చేప్పుడు రాత్రి వాళ్ళ గుసగుసలు, కాముడి వెకిలి నవ్వు! ఇది ఆపాలి, ఇట్లాంటిది జరగనీకూడదు. తన వంశంలో, శిష్టాచార సంపన్నమైన తన భర్త వంశంలో వీల్లేదు.

.... లేచి, బైటికి వెళ్ళింది. వరండాలోంచిచూసింది. అస్తమించే వెన్నెట్లో బావిగట్టున కాముడు వొక్కతే కని పించింది. ఆమె స్వరూపము "పాస్చల్" (Porthure) చూస్తే, లక్ష్మమ్మగారి హృదయంలో గొప్ప చలనం కలిగింది. కాముడినించి ఏదో మోహశక్తి ఉద్భవించి ఆమెని కలవర పెట్టినట్లయింది. ముడివేసిన జుట్టు చెవులమీద పడుతో, గుండ్రని బుజాలమీద తెల్లని పమిట సగం కప్పుకుని కొంచెం ముందుకు వొంగి, తదేకదృష్టిగా మహాకాశంలోకి చూస్తోంది. శేషయ్యా ఏడీ! తనకి తెలీని ఏ ప్రబలవాంఛ ఆ కాముణ్ణి పీడిస్తోంది? మరేదన్నా పిశాచం కాదుకద! ఆ తలపులతో కాముడిమీద మాతృప్రేమ పొంగింది లక్ష్మమ్మగారికి. పాపం కాముడు ఏదో బాధలో, అవస్థలో వుంది. తను సహాయపడాలి. ప్రేమ, కరుణచూపాలి. ఇందా

కణ్ణించి యెంత అన్యాయంగా, విరోధంగా తలుచుకుంది దాని విషయం! వెళ్ళి కావిలించుకుని, కాముణ్ణి అడిగితే! ఇదివరకటిమల్లేనే మొహం తిప్పేసి, వూరుకుంటుందేమో ! తనకి ఆ విచారంలో, బాధలో, స్థలంలేకుండాచేస్తే ! కాముడు ? ఆ గాయం తను వోర్చుకోలేదు. తనకూతురు తనని దూరంచేస్తే సహించలేదు. కాని పాపం, యెంత బాధ పడుతోందో! ఎందుకు ? ఒకవేళ కామంవల్లనేమా! నీచమైన తుచ్ఛమైన పశుత్వం వల్లనేమో ! స్త్రీకి అట్లా వుంటుందా! కాదు. ఆ శేషయ్య ఏదో చేస్తున్నాడు. దీని మనసుని విరిచాడు. పాడుచేశాడు. దురూహాలు ప్రవేశపెట్టాడు. తనెంత గుడ్డిగా వీణ్ణి నమ్మి తీసుకొచ్చింది! వాడే! వాడే! పాపం. వాడిమాయలో పడి తనకూతు రట్లా అయింది. అంతే! స్త్రీకి సహజంగా నిర్వ్యాజంగా ఇట్లాంటి పాడువూహ పుట్టదు. ఇప్పుడేం చెయ్యాలి ? ఎట్లా కాపాడ్డం కాముణ్ణి ?....

....కాముడు కొంచెం ముందుకి వొంగింది. చేతులు కొంచెం ముందుకి కదిల్చింది. శేషయ్య కాముడి దగ్గిరిగా వొచ్చేప్పటికే లక్ష్మమ్మగారి శరీరంలో విద్యుల్లతలు పైనించి కిందికి వేగంతో పరుగులెట్టినట్లయింది. ఎందుకు తనకీ ఆరాటం ? ఏమిటా తీవ్రమైన చూపు కాముడి కళ్ళలో! తనెప్పుడూ అట్లా చూడలేదే ఎవరినీ ! ఆమె ఎందుకట్లా చూడడం ? తను అట్లా చూస్తేమాత్రం తన భర్తకి అర్థమయ్యేదా ? దాని కర్థమేమిటి ? మోహంతో స్త్రీ పురుషుడివైపు పంపే సహజమైన వాల్చూపులుకాని,

కామంతో నిండి బరువైన దీర్ఘదృష్టులు కాని ఆమెకి తెలీవు.

శేషయ్య కాముడిదగ్గిరిగా నుంచున్నాడు. కాముడు అతని భుజంమీద నాలుగు వేళ్ళేసింది. లక్ష్మమ్మ వొళ్ళంతా ఝల్లుమన్నది. ఆమెమీదే మెవరో చేతులు వేసినట్లయింది. ఈ కొత్తభావమూ, రసనా, ఏమిటివి? సహజమైన యవ్వనభావోదయం అప్పటికి కలుగుతున్నట్లుం దామెకి. శేషయ్య మెడచుట్టూ చేతులువేసి కాముడు అతసికేసి వాలింది. ఇంక చూడలేక లక్ష్మమ్మగారు కళ్ళు తిప్పుకుంది. లోకమంతా, ఒకవస్తువు నొకటి ఆకర్షిస్తు న్నట్లయింది. తనహృదయాన్నెవ రట్లా పిలుస్తున్నారు? మెవరు? ఏమిటీవెలితి? యేంకావాలి? అనుభవం అని కొంచెంగా స్ఫురించింది. తను ప్రేమించాలి. తను ఎవ రినన్నా కావాలని కోరాలి. నరాలన్నీ కొత్తబాధతో లాగాయి. తల తిప్పేసుకుని చీకట్లో నడిచి రోడ్డుమీదికి వెళ్ళింది. నడిచి వెళ్ళిపోతోంది. తోవసంగతి ఆలోచించ కుండా—తనకేదో కావాలి. ఈ లోకమంతా వెతికైనా, తను కనుక్కోవాలి, ఆచూపు, కాముడి కళ్ళలో చూపుని, ఇప్పుడు తెలిసింది, తన భర్తకళ్ళలోకి చూసింది.

## 4

గత జీవితంలోంచి రెండుపటాలు కళ్ళముందు నిమి షంలో తిరిగాయి. తను కొత్తగాకాపరానికి వెళ్ళినరోజుల్లో, ఒకరాత్రి లక్ష్మమ్మ పక్కమీద పడుకోగానే, మామూలు ప్రకారం భర్త ఆమెవేపు తిరగకపోతే నిద్రపోతున్నాడని

తనూ పడుకుని నిద్రపోయింది. కొంతసేపటికి అతను ఆమె చుట్టూ చెయ్యేసి లేపాడు. కళ్ళువిప్పి, సిగ్గుపడి, సంతోషంతో, కళ్ళు మూసుకుంది.

"నువ్వెప్పుడొచ్చావు?"

"అప్పుడేవచ్చి నిద్రపోయినాను."

"మరి నన్ను లేపలేదేం?"

"మీరు నిద్రపోతున్నారు."

"లేపకూడదా?"

అతని చేతుల్లో కంఠంలో బాధ వినబడుతోంది.

"ఎందుకు?"

"నే నెందుకు లేపాను నిన్నిప్పుడు?"

"యేం చెపుతుంది?"

మళ్ళీ అడిగాడు.

"మీకు నేను కావాలిగనక"

"మరి నేను నీకక్కర్లేదూ?"

యేం తమాషాప్రశ్న! ఆయన తనకి కావలసి రావడమేమిటి? ఆజ్ఞాపించడానికీ, అనుభవించడానికీ తను ఆయన కవసరం. కాని ఆయనని తను కోరుకోడమేమిటి? తమాషాగా మాట్లాడుతున్నారు. నవ్వింది. ఆయన తన మీద ప్రేమచూపితే బావుంటుంది. నిజమే. కాని చూపకపోతే ఏమీలేదు. పగలంతా పనులతో సరిపుచ్చుకోవటంలా? అట్లానే రాత్రులూ నిద్రపోతుంది. తనకి కావలసి రావడమేమిటి?

యింకోరాత్రి !

"నన్నెప్పుడూ ముద్దుపెట్టుకోవేం ?" అన్నాడు.

పెట్టుకుంది.

"కాదు నే నడక్కుండా."

"యెందుకు ?"

"ముద్దుపెట్టుకోవాలనిపించదూ ?"

"ఉహూ"

"నేను బావుండనా ?"

"బావుండరూ !"

"అయితే ?"

"ఐతే ముద్దుపెట్టుకోడ మెందుకు ?

"నేను ముద్దుపెట్టుకుంటే, నీకు బావుండదూ ?"

"చాలా."

"మరి నువ్వు నన్ను ముద్దుపెట్టుకుంటే, నా కట్లా వుండదా ?"

"మీకు బావుంటుందా ?"

"కాదు మరీ !"

"సరే పెట్టుకుంటాలెండి. కాని మరిచిపోతాను."

## 5

యిట్లా తనకోసం, సహజంగా తనంతట తనకే ఉద్భవించే ప్రేమకోసం విచారపడిపడి పోయినాడు గావును! పాపం! ఈరాత్రి ఇక్కడవుంటే ! అబ్బా! యేమిటీబాధ తనకి ? యెవర్నన్నా కావిలించుకోవాలి, ప్రేమించాలి,

ప్రేమించాలి తనవారుగా, తనహృదయాన్నంతా అర్పించి తనని తనే మరిచిపోయి, రెండోవారై—యెవర్ని ? ఎక్కడ? యెట్లా! పురుషస్పర్శని తలచుకున్నప్పుడల్లా ఆ భర్తరూపమే ఆమెముందు నిలుచుంది. అతనుతప్ప ఇంత వరకు పురుషుడామెకి లేడు. కాముడు శేషయ్యవంక ఎట్లా దగ్గిరికి మెడని వంచుకుంది? ఎట్లా తీసుకుంది? తనుకూడా అట్లా—యీరాత్రి యిప్పుడే—యేడీ అతను? ఆ జాలి కళ్ళు, చిన్న మీసాలు, ఉత్తరియ్యపు వొంపు, మెడమీద ఆ చిన్న మచ్చ- ఏడీ! ఎట్లా ప్రేమించకుండా వొదిలింది అతన్ని అన్నాళ్ళు! యేమయింది తన హృదయం? తనే అతన్ని ఈ విధంగా కోరివుంటే, ఆ నాలుగు సంవత్సరాలూ కలవలె, సుందరకాంతివలె, స్వర్గశయ్యవలె, యెట్లా గడిచి పొయ్యేవో! అతని కంఠశబ్దమే, అతని చిన్నచూపులే, కదిలే అతని పెదవులూ, మహావరాలుగా, యెట్లా గడిచి పొయ్యేది జీవితం? చచ్చిపొయ్యేవాడా? చచ్చిపోనిచ్చేదా? తనంత ప్రేమిస్తే, తననించి వెళ్ళేవాడా? భర్తరూపం పక్కన దిగులుగా నుంచున్నట్టు తోచింది. చేతుల్లోకి, పెదిమలదగ్గిరికి యెట్లా తీసుకోడం?

"నిజంగా నీమీద ప్రేమకలిగింది. నువ్వు కావాలి నాకు. నువ్వే" అని యెట్లా చెప్పడం! యెన్నాళ్ళనించి మరిచిపోయింది అతన్ని ?....

....రోడ్డుకి అడ్డంగా యెర్రని దీపాలు పెట్టి కర్రలు కట్టివున్నాయి. వెనక్కి తిరిగింది. యింటికి వెళ్ళాలా? ఎక్కడయిల్లు? ఏవూళ్ళోవుంది తను! ఎట్లా ఆసత్రం దగ్గిరికి

కథా నిలయం



పోవడం? అక్కడ వాళ్ళిద్దరూ! వెంటనే కాముడిపైన అనివార్యమైన సానుభూతి తోచింది. ఆమె అనుభవంపైని వాత్సల్యం కలిగింది. ఆమె చూపులు అర్థమవుతున్నాయి. మెల్లిగాలక్ష్మమ్మగారి జ్ఞానాకాశంలో మబ్బులుతొలిగిపోయి వెన్నెల బైటపడ్డది. కాముడివాంఛ సహజంగా కనపడ్డది. కాని పరాయి మొగవాడితోనా? కాముడే ఆవిధంగా కాముడిభర్తవేపు చూస్తే ఆ ఆనందాన్ని, రసోద్రేకాన్ని చూసి ఆశ్చర్యపడి సంతోషించి వుండును లక్ష్మమ్మగారు. కాని ఆ శేషయ్యవేపు! ఛీ, ఛీ, పాపం! ఘోరపాపం! తన వంశపుకీర్తి! తన పేరు! తన భర్త మర్యాద! ఛీ, ఛీ, తనేం చెయ్యాలి? తన కెందుకదంతా? కాని యింకెవ రున్నారు! తన విధే. ఆ తలపుతో ఆమె మనసులో నీరసం తోచింది. మీనాక్షి సన్నిధిలో భక్తితో కళ్ళు మూసుకో తలుచుకున్న తన కెందుకీ కష్టమంతా! ఎందుకీ సమస్యలన్ని? వాళ్ళిద్దర్నీ తానెట్లా విడతియ్యటం? విడ తీస్తే కాముడు యిట్లా తనవలెనే బాధతో....తనకూతురు వేపు ప్రేమ వెల్లివిరిసింది. పాపం, అంత కోర్కెతో యవ్వ నంలో భర్తలేక వొంటరిగా యెట్లా భరిస్తుంది? ఏం చెయ్యాలి తను దాన్ని సంతుష్టిపరచడానికి? వెళ్ళి కావి లించుకొని—

"కాముడూ నీ బాధ నా కర్థమౌతోంది భయపడకు ....ఆనందంగా...." చప్పున ఆశ్చర్యంతో ఆగింది. తనే! ఈ పాడుపనిని వొప్పుకోడం! తనకే ఇట్లాంటి ఆలోచనలు! వాళ్ళిద్దరికీ తుచ్ఛమైన ఆ కామాన్ని వొప్పుకుని ఆచర్యల్ని

చూస్తే దినదిమూ....వాళ్ళ ప్రేమసంబంధాన్ని భరిస్తే.... వీల్లేదు. వాళ్ళమీద కోపం కలిగింది. అదేంపని!....సిగ్గు లేక - పాపం! ఘోరపాపం! యెవరికన్నా తెలిస్తే! తన వూరు వెళ్ళింతరవాత లక్ష్మమ్మ కూతురని వూరివాళ్ళందరూ! కాముడికి కడుపొస్తే? తల తిరిగింది, తనేం చెయ్యాలి? ఈ శేషయ్యని పంపెయ్యాలి. కాని వెడతాడా? ఆ చూపు, ఆ ఆకర్షణ?....వాళ్ళిద్దరూ ఇప్పుడేం చేస్తున్నారో! యింకా దగ్గిరిగా జరిగి గదిలోకే వెళ్ళి....ఎట్లా! తనకేది శరణ్యం? వెంటనే తానెవరినన్నా అట్లా గాఢంగా, తన ప్రేమశక్తి నంతటితోనూ....ఈ రాత్రే తన భర్త కావాలి. లేకపోతే తనే భర్తదగ్గిరికి వెళ్ళాలి. వెళ్ళి, దగ్గిరిగా, అబ్బా! తనో! తనకో! యెవరినన్నా తనూ అట్లానే ....ఇప్పుడే, ఈ రాత్రే....మళ్ళీ భర్త జ్ఞాపకం వొచ్చాడు. అతను కావాలి. ఎట్లా?_ఎట్లాఐనా? తనే ఆ యాత్రచేసి, అతని పాదాలమీద వాలి, తన పశ్చాత్తాపం తెలియచేసి, వెళ్ళిపోవాలి. వెంటనే అతని దగ్గిరికి వెళ్ళి, దగ్గిరిగా.... గట్టిగా....అబ్బా! చేతులు జాచింది, అకాశంవేపు వుత్త చేతుల్ని శుష్కించిన తన రొమ్ము దగ్గిరగా లాక్కొని వొత్తుకుంది. ఒళ్ళు, తొడలు, రొమ్ము అన్నీ ముందుకు జరిపి నుంచుంది.

"నీమీదే....నీమీదే....నువ్వే....నిన్నే...." అంది బిగ్గిరిగా, రహస్యం చెపుతున్నట్లు. అతన్ని తలుచుకుంటే యింకాపోయిన ఆనాటివలె చిన్నవాడుగా కనపడ్డాడు మనసుకి. తన భర్త కావాలి. ఎవరన్నా ఋషి ఆనిమిషాన....

యెవరన్నా దేవత: మధురమీనాక్షి! భగవతి! ప్రేమ జనని! మీనాక్షి! ఆమె యివ్వదూ! సుందరేశ్వరుడూ, మీనాక్షీ వూరేగుతున్నారు. అదుగో మధురసన్నాయి! పరిగెత్తింది ఆవేశంతో. భర్త. భర్త కావాలి....

## 6

వూరేగింపు.... తెల్లని మతాబు. వెలుతురులోకి వెళ్ళింది. అదుగో మీనాక్షి! రత్నహారాలతో బనారసు కండువాలక్రింద వెలిగిపోతోంది. జగద్దంపతులు. తపస్సు చేసి, అగ్నిగుండంలో దూకి, పతిని తెచ్చుకుంది.

"నా భర్త, భర్త నియ్యవూ? !... తల్లీ, తల్లీ నామీద కరుణించి భర్తనియ్యవూ! పరిగెత్తింది. భక్తి, ప్రేమ హృదయంలో పొంగిపోయినాయి. "తల్లీ, మీనాక్షీ, నా భర్త"....జాజిపువ్వులూ, సాంబ్రాణివాసన, భక్తుల కీర్తనలు, సన్నాయిపాట, పరిగెత్తి రథంముందు నుంచుంది. "తల్లీ వొచ్చాను. నా ప్రార్థన విను. నా ప్రేమకి, నా మోహానికి నా భర్త!....భక్తులపాలిటి కల్పతరువూ! మీనాక్షీ వొస్తున్నా నీ దగ్గిరికి!" యెగిరి, నడిచే రథంమీద దూకింది. కాలు జారింది. మీనాక్షిపైన వేసిన పూలదండలూ వుత్తరీయం పట్టుకుని వేళ్ళాడింది. వక్షం మీద ఆనుకున్న చేత్తో యింకా ఆదండా వుత్తరీయం పట్టుకునే కిందపడ్డది. ఆమె నడుంమీదనుంచి రెండుచక్రాలు పోయినాయి.